దరిద్రులు

తన ముప్పయ్యేళ్ల జీవితంలో అవమానం అంటూ యెరగని మంగపతికి యీ సంఘటన భరించలేని అవమానమైంది. హాయిగా దర్జాగా మూడు పడక గదుల బంగళాలో వున్నవాడు, ఒక మధ్యాహ్నం హఠాత్తుగా ఒంటరిగా ప్రయాణం కట్టాడు. తన స్వగ్రామానికి తన కడుపు జబ్బుకు మందిచ్చే ఆయుర్వేద వైద్యుడు వస్తున్నాడని తెలిసిన వెంటనే యీ ప్రయాణం. స్టేషనుకు వెళ్ళేసరికి మెయిలు మూడు గంటలు లేటు. రైలు దిగేసరికి బస్సులేదు. తినడానికి స్టేషను దగ్గర యేమీలేదు. స్టేషను దగ్గరలో నున్న దూరపు బంధువుల యింటికి వెళ్ళి నోరు విడిచి భోజనం పెట్టమని అడిగాడు. ఆ యిల్లాలు ఆ రాత్రి మీద కాస్త విసుక్కునే విధిలేక వండిపెట్టింది. రాత్రి పంద్రెండుకు భోజనం అయినా, మంగపతికి నిద్దర పట్టలేదు. ఎప్పుడు తెల్లారుతుంది, యెప్పుడు వెళ్ళిపోతానని చూశాడు. తెలతెలవారుతుండగానే ఆ మాసిన గడ్డం, బట్టలతో, దువ్వని యెగురుతున్న జుత్తుతో స్టేషనువేపు వెళ్ళాడు. వేసవి ఉదయం యెండ చుర్రుమంటున్నా తన వూరు వెళ్ళే బస్సు జాడ యింకా తెలియలేదు. బస్సు స్టాండుకు దక్షిణవేపున రైలు స్టేషను ప్రక్కనే ఒక ఓవర్ బ్రిడ్జి వుంది. ఉత్తరానికి ఒక శివాలయం. ఈ ఓవర్ బ్రిడ్జి ప్రక్కన నీడగా వుందని పతి అక్కడ కూర్చున్నాడు. తనకు యెదరగా బ్రిడ్జికి రెండో ప్రక్కన యింకో వ్యక్తి కూర్చున్నాడు. చిరిగిన నిక్కరు బనియనుతో బక్కచిక్కివున్నాడు. ఉండీ ఉండీ దగ్గుతున్నాడు. దరిద్రం అంటుకుని అసహ్యంగా వున్నాడు. పతి దృష్టి అంతా వాడిమీద వుండటం మూలాన యెవరెవరు ఓవర్‌బ్రిడ్జిమీద పోతున్నారో పట్టింపుగా చూడటంలేదు. ఇంతలో యీ భరించరాని అవమానం జరిగిపోయింది. అవమానించిన వాడెవడో సరిగ్గా చూడలేదు. తనూ యెదరగా వున్న వాడిలా అడుక్కునే వాడనుకుని యెవడో తన ముందూ ఒక నాణాన్ని పడేసాడు. ఇంతవరకూ తనో నల మహారాజు ననుకున్న పతికి అడవుల పాలయినంత బాధ కలిగింది.

ఇచ్చు అర్ధరూపాయి. అది పట్టుకుని తనవేపు చూసుకున్నాడు. తెల్లని కలీ లాల్చీ బాగా మాసిపోయి వుంది. కాళ్లలో అరిగిన చెప్పులు. లేచి అటువేపు వెళ్లి ఆ అసలు అడుక్కునే వానితో-

'ఈ అర్ధరూపాయి నామీద విసిరిన వాడెవడో నీకు తెలుసా?' అన్నాడు.

'తెలుసు. ధర్మం చెయ్యటం అంటే అతనికి మోజు!'

"దరిద్రగొట్టు వెధవ! మోజైతే నీలాంటి ముష్టివాళ్లకి వెయ్యలేకపోయాడా?"

"అయ్యా! తమరు తమ నెలవు కానిచోట కూర్చున్నారు."
"ఐనా, నేను అడుక్కునేవాడిలా కనిపిస్తున్నానురా?"
"నా కంటికి కనిపించలేదు. కానీ అతని కంటికి యెలా కనిపించారో?"
"కష్టార్జితమైతే యిలా చేస్తాడా?"
"నన్నేం చెయ్యమంటారు?"
"ఒక పని చేస్తావా?"
"చెప్పండి."
"ఇదిగో, యీ అర్ధరూపాయి వాడి ముఖాన్న పారేసి నా బదులు నాలుగు చీవాట్లు పెట్టు."
ఈ దరిద్రుడు చెయ్యిచాపాడు. ఆ అర్ధరూపాయి వాడి చేతిలో పడేసి 'నీ పేరు?' అన్నాడు.
"నీలాచలం."
"నీలాచలం! తప్పక యీ పని చేస్తావా?"
"నమ్మకం లేకపోతే మీరే రండి."
"బస్సు వచ్చే టైమయ్యింది. నేను అర్జంటుగా వెళ్లాలి."
"ఈ అర్ధ రూపాయి అతని మీద విసరి యేం చెయ్యమంటారు?"
"క్షమాపణ చెప్పమను."
"దానికి అతను వుత్తరం రాయాలి కదా! తమ యెడ్రసు యివ్వండి."
పతి అక్కడే దొరికిన ఒక చిత్తు కాగితం మీద అలా దారిపోయే వానిదగ్గర పెన్ను తీసుకుని యింగ్లీషులో తన యెడ్రసు రాసి యిచ్చాడు. నీలాచలం ఆ కాగితం అందుకోగానే గట్టిగా యెడ్రసు చదివి–
"మంచి హోదాలో వున్నవారే మీరు" అన్నాడు.
"ఇంగ్లీషు చదువుకున్న వాడివి, అడుక్కుంటున్నావేం! సిగ్గు పడటం లేదా?" మందలించినట్లు మంగపతి అన్నాడు.
చలం అలా కళ్లప్ప చెప్పి చూసాడు. ఆ చూపుల వెనుక తొలిసారి ఒక ఆలోచన పుట్టింది.
"అయ్యా! మీ రెవరో గానీ మీ పని నాచేత చెయ్యించుకోడానికి మంచి సలహా యిచ్చారు. నాదో చిన్న మనవి. మీకు అవమానం చేసినవాడు తక్కువ వాడు కాడు. పేరూ పరపతీ వున్నవాడు. వాడిని నేను వంచాలంటే వాడికి మీ బదులు నేను అవమాన పర్చాలి. దీనికి మీరు నాకిచ్చే పారితోషికం యెంత?"
"దీని కెందుకు పారితోషికం?"
పాతిక రూపాయలతో మొదలైన బేరం చివరకు ఒక రూపాయికి దిగింది. ఆ రూపాయైనా పతి చలంమీద విసుక్కుంటూ విసిరేసి బస్సు వచ్చిందని పరుగెత్తాడు.
వారం రోజుల తరవాత గ్రామంనించి తిరిగి వెళ్ళిపోతూ మంగపతి నీలాచలం ఆ జాగాలో వుంటాడేమోనని చూసాడు. లేదు. బహుశః యీసరికి ఇంటికి ఉత్తరం వచ్చి వుంటుందేమోనని అనుకుంటే యింట్లో యింకెన్నో వుత్తరాలున్నయ్‌గానీ తను యెదురు చూచిన వుత్తరంలేదు. నెలరోజులు గడిచినా యే వుత్తరం లేకపోవటంతో మోసపోయానని యిదో అవమానంగా తీసుకున్నాడు. ఒక అవమానం

బరువు మోయలేక వుపాయం ఆలోచించి యిప్పుడు రెండు అవమానాల బరువుతో సతమతమవుతున్నాడు. మండిపోతున్న మనుసుతో పీడపడిన మనిషిగా కదులుతున్నాడు. ఆరునెలలనాటికైనా నీలాచలం జాడగానీ ఉత్తరంగానీ లేదు.

అర్ధాంతరంలో వచ్చిన అంగవైకల్యంలా యీ సంఘటనలు అతని మనసులో పదేళ్లయినా నిల్చిపోయాయి. ఈ బెదురునించి బయటపడలేదు.

ఉద్యోగరీత్యా మద్రాసు ఒకసారి వెళ్లాడు. పిల్లలు, భార్యా యేవో సామాన్లు కొనమన్నారని ఒక సాయంత్రం పారిస్ కార్నర్‌లోని పేవుమెంటు షాపులకు వెళ్లాడు. ఎక్కడా సరిగ్గా బేరం కుదరటం లేదు. సింగపూర్ సామాన్లన్నీ వున్నయ్. ఏవి అసలు సరుకో యేవి నకిలీవో చెప్పటం సాధ్యం కాదు. అందరూ మోసగాళ్లలానే తన దృష్టికి కనిపించడంచేత యే వస్తువునైనా సగానికి సగం యిస్తానంటున్నాడు. దీపాలు వెలిగించినా తన కొడుకు చెప్పిన కాలిక్యులేటర్ కొనలేకపోయాడు. అలా వెళ్తూ ఒక పేవ్‌మెంటును అనుకుని వున్న బడ్డీ షాపు యెదర ఆగి ఆ సైంటిఫిక్ కేలిక్యులేటర్ విలువెంత అని అడుగాడు.

ఆ షాపువాడు రెండువందల డబ్బయి అన్నాడు.

'నూటయేభయికిస్తావా?' బేరమాడాడు పతి.

ఆ షాపువాడు యెగాదిగా చూసి ఆ కాలిక్యులేటర్ మంగపతి చేతపెట్టూ-

'ఊరకే తీసుకోండి' అన్నాడు.

'ఊరకే తీసుకోడానికి నేను దరిద్రుడనుకున్నావా?' అని తీక్షణంగా అడిగాడు మంగపతి.

'పరపతి వున్న మనిషి యేమన్నాడంటే.....' అంటూ చప్పున మెడలో లాకెట్ తీసి చూపించాడు షాపువాడు.

మంగపతి మిడుగుడ్లకు చలం మెడలోని బంగారు గొలుసుకు లాకెట్‌లా వున్న అర్ధరూపాయి కనిపించింది.

'ఇదిగో! ఆనాడు మీరు యీ లక్కీ అర్ధరూపాయి యివ్వకపోతే, యీనాటికీ అడుక్కుంటూ వుండేవాడిని. రండి, లోపలకిరండి.'

సంశయిస్తున్న మంగపతితో-

'నేను కోపంతో వూరకనే తీసుకోమనలేదు. మిమ్మల్ని పోల్చగానే మీ అబ్బాయి చదువుసాగడానికి ఇది వుపయోగపడుతుందని యిచ్చాను. ఇదంతా మీ చలవకదా! అలా సంశయిస్తారేం? ఎలా యింత వాడినయ్యానో తెలుసుకోడానికైనా లోనికిరండి' అన్నాడు చలం.

కొట్టు వెనుకనే చిన్న జాగాలో ఒక టేబిలు, నాలుగు కుర్చీలు.... చిన్న టేబిలు ఫేను తిరుగుతోంది. 'థమ్సప్' బోటిల్స్ రెండు తీసి విప్పాడు. ఎదరెదరగా కూర్చున్నారు. చలం మొదలుపెట్టాడు:

'మనిద్దరం తొలిసారి కలుసుకున్నప్పుడు యిద్దరి పరిస్థితి ఒక్కలానేవుంది కదా!'

'అంటే?'

'మీరు హోదాలో వున్నా మీ కెవరూ అవమానించలేదు. నేను అడుక్కుంటున్నా అప్పటివరకూ నన్నెవరూ అవమానించలేదు. మీకు ఆ కోదండరామయ్య అవమానిస్తే, మీరు నన్ను అవమానించారు.'

నేనా?

'అవును. ఇంగ్లీషు చదువుకుని అడుక్కు౦టున్నావు, సిగ్గులేదా అన్న మీ మాటలను అవమానంగా తీసుకున్నాను. అవమానాన్ని అవకాశంగా వినియోగించుకోవాలని ఆ క్షణంలోనే నిశ్చయించాను.'

'నిశ్చయించి నమ్మకద్రోహం చేశావు కదా!'

'లేదు, అదేం చెయ్యలేదు తొలిసారి చదువువలన వచ్చిన తెలివితేటలు ఉప యోగించాను ఆ రోజే కోదండరామయ్య యింటికి వెళ్లాను. 'బాబూ, ఒక రహస్యం' అన్నాను. అనగానే తన గదిలోనికే తీసుకపోయాడు. 'బాబూ, తమరు యెవరికి ధర్మం చెయ్యాలో, యెవరికి చెయ్యకూడదో ఆలోచించరా?' అన్నాను. ఏమైందిరా అన్నాడు. యిచ్చు అర్ధరూపాయి చూపించి, 'మీరు వుదయం ఒక-సి.ఐ.డి. ఆఫీసరు మీద ధర్మంగా యీ నాణెం విసిరారు, అతగాడు నామీద విసురుతూ మీ అంతు చూస్తానన్నాడు. మీకీ భాగ్య భోగాలెలా వచ్చాయో కూపీతీసి తగిన చర్య తీసుకుంటానన్నాడు. మీ ఉప్పు తిన్నవాడిని, జాగర్తపడండి' అన్నాను.'

'కోదండరామయ్య భయపడ్డాడా?' అడిగాడు మంగపతి.

'కాసేపు ఆలోచించి – 'యీ పని చెయ్యడానికి వాడి దగ్గర యెంత పుచ్చుకున్నావో చెప్పితే దానికి వందరెట్లు నేనిస్తాను. నిజం చెప్పు' అన్నాడు.'

'అబద్ధం అని ఎలా పోల్చుకున్నాడు.?'

'ఎలా పోల్చుకున్నాడో తరవాత చెప్పాడు ఎందరినో యిలానే బ్లాక్ మెయిల్ చేసి తనూ పెద్దవాడయ్యాడట. ఆ చేతలు మర్చిపోడానికే చేతనున్న సంపదను బీదాబిక్కి మీద విసురుతున్నాడట.'

'ఎంత యిచ్చానని చెప్పావు? వందని చెప్పి వుంటావ్–'

'లేదు. అలా చెప్పివుంటే ఒక చెంపపెట్టు పెట్టేవాడు. ఉన్నమాట చెప్పాను. బేరం ఆడి ఆడి ఒక రూపాయి మీద పారేసి ఇంకో అనుమానం అంటించాడని చెప్పాను. నీలాంటి నిజాయితీ గల మనిషి బాధపడకూడదని, వ్యాపారం కిటుకులు చెప్పి పెట్టుబడికి సరిపడ్డ డబ్బిచ్చాడు.'

అంటూ లేచి ఆ కాలిక్యులేటర్ తెచ్చి మంగపతి యెదురుగా పెడ్తూ 'మీ అబ్బాయికి కానుక' అన్నాడు.

'నేను రూపాయి దీనికోసం యివ్వలేదు. కోదండరామయ్యచేత క్షమాపణ వుత్తరం రాయిస్తావని యిచ్చాను.'

'అప్పుడే రామయని కోరితే నామీద విరుచుక పడ్డాడు.'

'ఏమని?'

'ఆ దరిద్రుడికెవడు రాస్తాడని.'

మంగపతి కాస్సేపు అలా నిల్చొనే వణికిపోయాడు. జేబులో రెండు వందల డబ్బయ్యైదు రూపాయలు తీసి టేబిలు మీదపెట్టి కాలిక్యులేటర్ తీసుకుని వెళ్ళిపోయాడు.

(ఆంధ్ర సచిత్ర వారపత్రిక, *28-12-1984*)

***